మోసం చంద్రబాబు నైజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు



క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, పార్టీ శ్రేణులు తదితరులు

- ఏడాదిన్నరైనా హామీలు అమలు చేయడం లేదు
- ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్నికి మంగళం

నిడదవోలు: ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడి నైజం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు విమర్శించారు. పట్టణంలోని కాపు కల్యాణమండపంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని కామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసనాయుడు ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటింటికీ వెళ్లి వివరించాలి

ఎన్నికలకు ముందు కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరుతో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని శ్రీనివాసనాయుడు మండిపడ్డారు. సూపర్ సిక్స్‌తో సహా 143 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తీరును ఎండగడుతూ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా జగనన్న ప్రభుత్వంలో కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేశామని ఆయన గుర్తుచేశారు. ఏడాది తిరగక ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

ఆసుపత్రి నిర్మాణం ఎందుకు నిలిచిపోయింది..?

గత ప్రభుత్వ హయంలో కాపునేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు పట్టణానికి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాబార్డు నిధులు రూ.19 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు చేశారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆసుపత్రి నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేశారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉందనే కుంటుసాకులు జనసేన నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిడదవోలు ఆర్వోబీ నిర్మాణానికి అమృత్‌పథకంలో భాగంగా మాజీ సీఎం జగన్ రూ.200 కోట్లు మంజూరు చేశాకే ఆర్వోబీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, భూసేకరణకు రూ.14 కోట్లు నష్టపరిహారం బాధితులకు అందించామన్నారు.

అబద్ధాల పుట్ట

పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజులు మాట్లాడుతూ ఒక్క పథకం పూర్తిగా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, చంద్రబాబు అబద్ధాల కోరని ధ్వజమెత్తారు. పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు హయాంలో పట్టణంలో గణపతి జంక్షన్, ఐలవ్ నిడదవోలు పార్కుల నిర్మాణాలు, ఆర్వోబీ నిర్మాణంతో పాటు పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆలమూరి భారతి, పిట్ట పద్మావతి, బిర్రె పార్వతి, అహ్మదున్నిషా బేగం, పడాల శిరిష, ఆకుల ముకుందరావు, దాకే అనిల్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాన్‌భాషా, కోఆప్షన్ సభ్యులు దిరిసెన రామచంద్రరావు, ఎస్‌కే వలి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఆలమూరి రాజ, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మడిపల్లి భాస్కరం, నియోజకవర్గ అంగన్‌వాడీల విభాగం అధ్యక్షురాలు పి.జాన్సీ, తోలేటి కోటేశ్వరరావు, నాగేంద్ర, మొదలవలస నాని, వంగా నాగేశ్వరరావు, ఎస్‌కే జాకీర్ పాల్గొన్నారు.

దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

నిడదవోలు పట్టణ అభివృద్ధిని గాలికి వదిలేసిన జనసేన నాయకులు కేవలం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి జనసేన పార్టీ కండువాలు కప్పడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎందుకు జనసేన కండువా కప్పుకున్నారో ప్రజలందరూ గ్రహించాలన్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు దమ్ముంటే రాజీనామా చేసి గెలివాలని ఆయన సవాల్ విసిరారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

తన తండ్రి జీఎస్ రావుతో కలిసి తాను ఎప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటామని, కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దని, 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉంటూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం జగనన్నకు అండగా ఉంటూ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేంత వరకు కృషి చేయాలన్నారు.

బాధితుడికి మాజీ హోంమంత్రి భరోసా



పెద్దిరెడ్డిని పరామర్శిస్తున్న తానేటి వనిత

నల్లజర్ల: దూబచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దొబ్బిడి పెద్దిరాజు కూటమి నాయకుల వేధింపులతో ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ హోంమంత్రి తానేటి వనిత గురువారం బాధితుడిని పరామర్శించారు. ఆయన భార్య రాణితో మాట్లాడుతూ పార్టీ ఎలప్పుడు అండగా ఉంటుందని ఇటువంటి దుందుడుకు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిరువ్యాపారి అయిన పెద్దిరాజు గత 35 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే ఆయన దుకాణం వెనుకనే ఇటీవల వ్యాపారం ప్రారంభించిన ఓ టీడీపీ నాయకుడు, షాపును తీయించాలని పట్టుబట్టి టీడీపీ నాయకులు, పోలీస్, పంచాయతీ, విద్యుత్ సిబ్బంది అండదండలతో వేధించడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. అందరి కళ్ల ముందే పురుగు మందుతాగి కిందపడిపోతే అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బంది గాని రక్షించకుండా మానవత్వం లేకుండా చూస్తు ఉన్నారంటే, మా కార్యకర్తలను, నాయకులను కూటమిలో ఏవిధంగా ఇబ్బందులు పెడుతున్నారో ప్రజలందరికి అర్థమవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకట్రాజు క్యాడర్‌ను నివారించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, తొమ్మండ్రు రమేష్, నక్కాపండు, తొమ్మండ్రురవి, చేబ్రోలు బాలాజీ, సయ్యద్ మునాఫ్, వల్లూరి శేషగిరిరావు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



సుభాణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి: ఉపాధ్యాయ వృత్తిలో దక్కిన గౌరవం మరే వృత్తిలోనూ లభించదని, ఉద్యోగ జీవితంలో ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో కృషి అభినందనీయమని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయరాలుగా పనిచేసి గురువారం పదవి విరమణ పొందిన పి.సుభాషిణి సత్కార సభను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్ని పూల మాలలు, శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినంధనలు తెలిపారు. అనంతరం సుభాషిణి మాట్లాడుతూ గత 38 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తి విద్యార్థుల మధ్యలో పనిజేయడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలకు రూ.20 వేలు విలువ గల టెంట్, ఇతర సామాగ్రీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో సీహెచ్ బాలామణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాసవి, సుబ్బలక్ష్మి, క్షేమకుమార్, మోహన్, డి.దుర్గారావు, పూర్వ విద్యార్థి సంఘం సభ్యలు వీరమళ్ల సుర్యానారాయణ, అడ్డాల డేవిడ్‌రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన వైఎస్సార్ సీపీ నాయకులు



నూతన వధూవరులతో వేణుగోపాలకృష్ణ, రాజా, తలారి వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల రాంబాబు కుమార్తె జాహ్నవి, ప్రవీణ్‌ల వివాహ వేడుకకు గురువారం వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. కొవ్వూరులో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, నియోజవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు, రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డా. గూడూరి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్ బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి అబ్బులు, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పరిమి సోమరాజు, నాయకులు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఉప్పులూరి సూరిబాబు, దేవగుప్తాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

నిడదవోలు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండింటెంట్ డాక్టర్ ఫయాజ్ అన్సారి సూచించారు. పట్టణం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయవ్యాధి లక్షణాలు ఉన్నవారికి వివిధ ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ఒక వ్యాధిగ్రస్తుడు సరైన చికిత్స తీసుకోకపోతే అతని ద్వారా ఏడాదికి 15 మందికి వ్యాధి సోకే అవకాశముందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే కల్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సర్వరాయ షుగర్స్ లిమిటెడ్ సౌజన్యంతో దత్తత తీసుకున్న టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎస్ ఆర్. పోతురాజు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రమోద, ఎం.రాంబాబు, ఎల్‌టీ రాజ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ పుష్పకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో జాగ్రత్తలు తప్పనిసరి

పెరవలి: గ్రామాల్లో భూమి సర్వే నిర్వహించేటప్పుడు అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని లేని పక్షంలో ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఓపీఆర్‌డీ సి.హెచ్ వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ప్రాంతాన్ని ఆన్‌లైన్ చేయాలని గృహాల సర్వే నిర్వహించినప్పుడు యజమాని ఇచ్చే దస్తావేజులు ఆధారంగా పక్క సమాచారంతో ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వే అనంతరం ప్రతి ఒక్కరికి స్మార్ట్ కార్డు జారీ చేస్తామన్నారు.

లెక్చరర్ల తొలగింపుపై విద్యార్థుల ఆందోళన

సీనియర్ అధ్యాపకులను తొలగించారంటూ నిరసన



నల్లజర్ల ఎస్.ఆర్.కే కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నల్లజర్ల: స్థానిక యస్.ఆర్.కే కళాశాల ఎదుట విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. గత 20 సంవత్సరాలుగా కళాశాలలో పనిచేస్తున్న బోటనీ, జువాలజీ అధ్యాపకులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంపై వారు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రశ్నించిన ఇద్దరు దళిత లెక్చరర్లను కళాశాల యాజమాన్యం పిలిచి మూడు నెలల జీతాలు ఇచ్చేస్తాం, అనంతరం కళాశాల నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. లెక్చరర్లు మూడు నెలల జీతం తీసుకొని కళాశాలకు రావడం మానేశారు. దింతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. అనుభవం ఉన్న లెక్చరర్లను తీసేస్తే ఇపుడు తమ పరిస్థితి ఏమిటి? కొత్తవారికి అంత అనుభవం ఉంటుందా అని ప్రశ్నిస్తూ ఆందోళన చేపట్టారు. దీనిపై కళాశాల కరస్పాండెంట్ గన్నమని దొరయ్యను వివరణ కోరగా ఆ లెక్చరర్లు విద్యార్థులకు బోధించకుండా, విద్యార్థులను రెచ్చగొట్టి సమస్యలు సృష్టిస్తున్నారని వారికి ఇవ్వాల్సిన జీతం ఇచ్చేసామన్నారు.

రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వాలు

పెరవలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని కూనీ చేసి విస్మరిస్తున్నారని ఇది దేశానికి చాలా ప్రమాదకరమని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి ధ్వజమెత్తారు. పెరవలిలో ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమాన్ని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. బీహార్ రాష్ట్రంలో ఓటర్ నమోదు పక్రియ రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతుందని ఎన్నికల కమీషన్ రాజ్యాంగాన్ని దాటి ప్రవర్తిస్తుందని ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనని హెచ్చరించారు. మండల కమిటీ అధ్యక్షుడు బుద్దన లక్ష్మణరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర పాల్గొన్నారు.

విత్తన మొలకపై అవగాహన

దేవరపల్లి: విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరులో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు విత్తనాలు తెచ్చుకున్న వెంటనే మొలక శాతాన్ని పరిక్షించాలన్నారు. అకుమడిలో వేసి మొలక వచ్చే వరకు వేచి చూడడం వల్ల సమయం వృధా అవుతుందన్నారు.

విత్తనం కొనుగోలు చేసే ప్రతి రైతు కొనుగోలుకు సంబంధించిన రశీదును తప్పని సరిగా తీసుకోవాలన్నారు. దశపర్ణికషాయం, ఫిష్ అమానోఆసిడ్, పాల ఇంగువ మూడింటిని సమపాళ్లలో నీటిలో కలిపి డ్రోన్ ద్వారా వరి చేనుకు స్ప్రేయింగ్ చేసి రైతులకు అవగాహప కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంజన, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: పోతవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పోతవరం, కృష్ణాయిగూడెం, సుభద్రపాలెం, కవులూరు, నబీపేటలలో సబ్‌స్టేషన్ మరమత్తుల నిమిత్తం 1వ తేది ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయానికి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. ఆయా గ్రామాలలో 3 ఫేజ్ సప్లయి ఉదయం 4 నుంచి 8 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందించనున్నట్లు చెప్పారు.

పెరవలి: మండలంలోని కానూరు, పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలుపుదల చేస్తామని తెలిపారు. అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, కడింపాడు, మల్లేశ్వరం గ్రామాలకు, కానూరు సబ్ స్టేషన్ పరిధిలో కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయానికి ఉదయం ఐదు నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందిస్తామన్నారు.

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల కత్తిరింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు. గౌరీపట్నం, దుద్దుకూరు, కొండగూడెం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. 33/11 కేవీ దేచర్ల ఎస్ఎస్ నుంచి దుద్దుకూరు రూరల్ ఫీడర్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాధిగ్రస్తుల ఖాతాల్లోకి రూ.1,000 జమ

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్‌లో భాగంగా కొవ్వూరులోని క్రిస్టియన్ పేట అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద గురువారం వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. జిల్లా డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య మాట్లాడుతూ టీబీ వ్యాధి బారిన పడిన రోగులు 6 నెలలు క్రమం తప్పకుండా చికిత్సతో పాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. దేశంలో క్షయమరణాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని 2030 నాటికి క్షయ రహిత భారత దేశంగా కృషి చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనికి నెలకు రూ.1,000 చొప్పున జమ అవుతాయని వివరించారు. 100 మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న శ్రీ సర్వరాయ షుగర్ లిమిటెడ్ ప్రతినిధి హెచ్ ఆర్ శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ధర్మరాజు, కిషోర్ నాయక్. నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధిక ఎరువుల వినియోగం అనర్థం



నల్లజర్లలో రైతులకు సూచనలిస్తున్న సోమశేఖరం

నల్లజర్ల: ఖరీఫ్‌లో మోతాదుకు మించి ఎరవులు వాడవద్దని మండల వ్యవసాయాధికారి బి.సోమశేఖరం రైతులకు సూచించారు. గురువారం నల్లజర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానోటెక్నాలజీ ద్వారా మార్కెట్‌లో లభ్యమవుతున్న నానో యూరియా, డీఏపీలను వాడటం ద్వారా ఖర్చు తగ్గించు కోవచ్చునన్నారు. ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. అనంతరం కొవ్వూరు ఏడీఏ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈక్రాఫ్ నమోదు చేసుకోకపోతే ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టపరిహారం పొందాలన్నా, ధాన్యం మద్దతు ధర, ఈక్రాప్ ఇన్సూరెన్స్ ఇతర ప్రభుత్వ పథకాలు అందవన్నారు. రూ.210 చెల్లించి పంటలభీమా నమోదు చేయించుకోవాలన్నారు. ఏఈఓ పుష్పలత, రైతులు, వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో నేల సారవంతం

నిడదవోలు రూరల్: ఖరీఫ్ సాగులో రైతులు తక్కువ ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు పొందాలని ఏరువేక కేంద్రం శాస్త్రవేత్తలు నరసింహరావు, శ్రీనివాస్ సూచించారు. మండలంలోని డి.ముప్పవరంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు నరసింహరావు, శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయన ఎరువులతో పాటు సేంద్రియ, జీవన ఎరువులను, ఘన జీవామృతం, ద్రవ జీవామృదం వంటి సహజ ఎరువులను వాడటం ద్వారా నేలను సారవంతం చేసుకోటుందని ససూచించారు. పురుగుల తెగుళ్ల ఉధృతిని గమనిస్తూ అవసరం మేరకే మందులు స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జె.రామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై ఒత్తిడి తగ్గించాలి

నల్లజర్ల: రేషన్ డీలర్ల పనిభారం తగ్గించి కమీషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నల్లజర్లలో గురువారం జరిగిన డీలర్ల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహమూర్తి మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన వృద్దులు, వికలాంగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాలని ప్రభుత్వం ఆదేశించిందని దీని వల్ల డీలర్లకు ఖర్చులు పెరుగుతున్నాయని దీనిని గుర్తించి డీలర్లకు ఇచ్చే కమీషన్ పెంచాలని కోరారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా దూళిపాళ వెంకన్న, కార్యదర్శిగా ప్రత్తిపాటి లతా మంగేష్కర్, సహయకార్యదర్శి బాయిశెట్టి లక్ష్మణరావు, కోశాధికారి ఈపిచర్ల కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా చీమకుర్తి చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

రీసర్వే పక్కాగా చేయాలి

పెరవలి: మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే పూర్తయ్యిందని మిగిలిన కానూరు అగ్రహారం, కాకరపర్రు, తీపర్రు, పెరవలి గ్రామాల్లో రీసర్వేను 3వ ఫేజ్‌లో ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని తహసీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విఆర్‌ఓలు, సర్వేయర్‌లతో సమావేశం నిర్వహించారు. రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఆగష్టు 6 వతేదీకి గ్రామ సరిహద్దులు నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తింపు, గ్రామాల సరిహద్దులు పక్కాగా ఉండాలని, వీటిలో తేడాలు వస్తే గ్రామాల సమస్య అవుతుందని అందుకు సిబ్బంది జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు.

మండల విద్యాశాఖాధికారిగా రామకృష్ణారావు

తాళ్లపూడి(కొవ్వూరు): మండల విద్యాశాఖాధికారి-1గా డా.ఎ రామకృష్ణారావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమహేంద్రవరం జాంపేటలో గల నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఈ మేరకు కొవ్వూరు మండల విద్యాశాఖాధికారి -1 గా పూర్తి బాధ్యతలను అప్పగించినట్లు ఉన్నతాధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మండల మానవత అధ్యక్షుడి ఎన్నిక

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు బండి సూర్యప్రకాశరావు ఎన్నికయ్యారు. గురువారం సంస్థ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం ఉపాధ్యక్షుడిగా ఆచంట సుభాష్ చంద్రబోస్, కార్యదర్శిగా కూసిపూడి నరేష్ వర్మ, సంయుక్త కార్యదర్శిగా కె.రవికుమార్, కోశాధికారిగా తీగల లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నలమాటి లలిత, ఆకుల నాగేశ్వరరావు, నున్న శివరామకృష్ణ, పచ్చా రాంగోపాల్ నూతన పాలవర్గం ప్రమాణస్వీకారం చేసింది.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని ఉండ్రాజవరం శ్రీసుధీంద్రబాబు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు నందిగం భాస్కరరామయ్య గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసనాయుడు హాజరవుతారని తెలిపారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యచరణపై చర్చిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అనధికార స్థలాలకు అనుమతులు తప్పనిసరి

నిడదవోలు: నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో ప్రజలు స్వీయ ధృవీకరణ అంగీకార పత్రం సమర్పించి అనధికార స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక సంఘ పరిధిలో అనధికార లే-అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు 90 రోజుల్లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా అనధికార లే- అవుట్స్, ప్లాట్లు క్రమబద్ధీకరణ 2020 చట్టాన్ని సవరణ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పురపాలక సంఘంలో 2025 జూన్ 30 తేదికి ముందు ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసినవారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువ

చాగల్లు: మండల కేంద్రం చాగల్లులో కొండచిలువ సంచారంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికంగా ఉన్న షుగర్ ఫ్యాక్టరీ మూత పడి ఉండడంతో విషసర్పాలకు నిలయంగా మారింది. ఈ మేరకు సమీపంలోని ఇస్లాం పేటలో బుధవారం రాత్రి కొండచిలువ స్థానికుల కంటపడింది. దీంతో భయభ్రాంతులకు లోనై ఎట్టకేలకు ధైర్యం చేసి పలువురు కొండచిలువను హతమార్చారు.